క్లుప్తంగా

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



దాత కిరణ్‌కుమార్ అందించిన పుస్తకాలతో విద్యార్థులు

కడియం: మండలంలోని దుళ్ల -1, 2 ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థులకు వేలాది రూపాయల విలువైన నోటు పుస్తకాలను దాత కంటిపూడి కిరణ్‌కుమార్ అందజేశారు. ఈ మేరకు శుక్రవారం స్కూల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యంఈవోలు యంఎస్ మణికుమార్, వై. నాగేశ్వరరావు, దాత తండ్రి బాలకృష్ణ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఉపసర్పంచ్ తోకల శ్రీనివాసరావు, హెచ్‌ఎం గెద్దం ఆనంద్, శశి కుమారి, ఉపాధ్యాయులు గంపల పాపారావు, చల్లా వీర వెంకటేశ్వర్లు, అన్నే దొరబాబు, పదాల రాముడు, జి.ధనలక్ష్మి, బి.అబ్బాయి, ప్రమీల కుమారి, ఎస్ఎంసీ చైర్మన్ వీరబాబు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం

కంబాలచెరువు: ప్రతి ఒక్కరూ సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని టీడీపీ మాజీ కార్పొరేటర్ వర్రే శ్రీనివాసరావు అన్నారు. స్థానిక గాంధీపురం 2 ఉన్నత పాఠశాలలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో స్టాప్ డయేరియాపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిశుభ్ర వాతావరణంలో, కలుషిత నీరు డయేరియాకు కారణమన్నారు. ప్రతి ఒక్కరూ ఈ సీజన్‌లో వచ్చే రోగాలపై అవగాహన కలిగి ఉంటే వాటి నివారణ సులభమవుతుందన్నారు. డాక్టర్ ఆలేఖ్య మాట్లాడుతూ విద్యార్థులు భోజనం చేసేముందు, చేసిన తరువాత సబ్బుతో చేతులు శుభ్రం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఎమ్ డి.సీలిమ, ఆశావర్కర్లు డి.పార్వతి, ప్రధానోపాధ్యాయులు ఆర్.సన్యాసిరావు పాల్గొన్నారు.

నేటి నుంచి పదాధికారుల సమావేశం

రాజమహేంద్రవరం రూరల్: భగవాన్ శ్రీ సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని శని, ఆదివారాల్లో రాజమహేంద్రవరం శ్రీ సత్యసాయి గురుకులంలో రాష్ట్ర, జిల్లా పదాధికారుల సమావేశం నిర్వహిస్తున్నట్లు శ్రీ సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు బులుసు వెంకటేశ్వర్లు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని జిల్లాల నుంచి ఆధ్యాత్మిక, సేవ, విద్య, యువజన విభాగాల సమన్వయకర్తలతో పాటు, శ్రీ సత్యసాయి సేవా సమితి, భజన మండళ్ల కన్వీనర్లు పాల్గొంటారని చెప్పారు. ఈ సందర్భంగా బాబా శత జయంతి ఉత్సవాల కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తారని, ఈ కార్యక్రమానికి అఖిల భారత సత్యసాయి సేవా సంస్థల సమన్వయకర్త కోటేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావుతోపాటు రాష్ట్రస్థాయి నాలుగు విభాగాల సమన్వయకర్తలు పాల్గొంటున్నారని వెంకటేశ్వర్లు తెలిపారు.

మొక్కజొన్న రైతుల ధర్నా

మధురపూడి: కోరుకొండ మండలం కాపవరం వ్యవసాయ శాఖ ఏడీ కార్యాలయం వద్ద హైబ్రీడ్ మొక్కజొన్న రైతులకు రావల్సిన బకాయిలు ఇప్పించాలని కోరుతూ శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు బీకే మల్లికార్జునరావుకు వినతిపత్రం అందించారు. కంపెనీ ఆర్గనైజర్ హామీ మేరకు తుఫానుకు ముందు సాగు చేసిన పంట నష్టపోవడంతో మరలా తుఫాన్ అనంతరం కంపెనీ ఇచ్చిన విత్తనాలు సాగు చేశామని ముందుగా ఇచ్చిన హామీ ప్రకారం కొనుగోలు చేసిన పంట ఉత్పత్తికి పూర్తిస్థాయిలో నగదును చెల్లించాలని రైతులు అన్నారు. ఈ కార్యక్రమంలో మునగాలకు చెందిన మొక్కజొన్న రైతులు గిద్దా వెంకట సత్యనారాయణ, మండపాక వెంకటరాజు, కొండపల్లి వీర్రాఘవులు పాల్గొన్నారు.

మేఘమే ఛత్రమై.. కనువిందు చిత్రమై





రాజమహేంద్రవరంలో రోడ్ కం రైల్ వంతెనపై నుంచి మేఘావృతమైన ఆకాశం

రాజమహేంద్రవరం సిటీ: ఉదయం అంతా ఉక్కపోత, మధ్యాహ్నం మండుటెండ కారణంగా విలవిల్లాడిన నగర ప్రజలు సాయంత్రం ఆకాశం మేఘావృమై ఈదురు వీయడంతో సేద తీరారు.

ఆకాశంలో మేఘాలు విభిన్న ఆకృతుల్లో దర్శనమిచ్చి నగర ప్రజల మనస్సులను దోచుకున్నాయి. వర్షం వస్తుందని ఆశగా ఎదురు చేసిన నగర ప్రజలకు మేఘాలు మాత్రం కనువిందు చేశారు. దట్టమైన మేఘాలు ఆకాశంలో కమ్ముకుని రాజమహేంద్రవరం నగరాన్ని దుప్పటిలా కప్పేశాయి. శుక్రవారం సాయంత్రం రోడ్ కమ్ రైల్వే బ్రిడ్జిపై నుంచి ప్రయాణిస్తున్న వారిని వివిధ రంగుల్లో మేఘాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

7న జగన్నాథ స్వామి రథయాత్ర

సీటీఆర్ఐ: ఈనెల 7వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక శ్యామలానగర్ రామాలయం సెంటర్ నుంచి జగన్నాథ స్వామి రథయాత్ర ప్రారంభమవుతుందని ఇస్కాన్ రాజమండ్రి మందిర కమిటీ చైర్మన్ శివానంద నిమాయదాస్ చెప్పారు. ఇస్కాన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది పూరీలో జగన్నాథ స్వామి రథయాత్ర వైభవంగా జరుగుతుందన్నారు. ఇస్కాన్ మందిరంలోనూ జగన్నాథ స్వామి కొలువై ఉన్నారని ఇక్కడ కూడా ఏటా రథయాత్ర నిర్వహిస్తున్నామని గుర్తుచేశారు. సాధారణంగా రథయాత్ర అంటే ఉత్సవ మూర్తులను ఊరేగిస్తారని, జగన్నాథ స్వామి రథయాత్రలో మూలవిరాట్టును ఉంచుతారని ఆయన చెప్పారు. మందిరానికి రానివాళ్ల కోసం స్వామి వారే స్వయంగా బయటకు వచ్చి దర్శన భాగ్యం కల్పించడమే జగన్నాథ రథయాత్ర ప్రత్యేకతగా శివానంద నిమాయదాస్ చెప్పారు. ఇస్కాన్ ఆంధ్రప్రదేశ్ జోనల్ సెక్రటరీ రేవతి రమణ్ ప్రభుజీ ముఖ్య అతిథిగా పాల్గొని, రథయాత్ర ప్రారంభిస్తారని తెలిపారు. కీర్తనలు, భజనల నడుమ శ్రీ జగన్నాథ బలదేవ సుభద్రల విగ్రహాలను రథంలో ఉంచుతామని, ఇస్కాన్ స్వామీజీలు, ముఖ్య అతిథుల సందేశాలు ఉంటాయని తెలిపారు. గోరక్షణ పేట, ఆజాద్ చౌక్, జాంపేట, ఊర్వశి సెంటర్, బీఈడీ ట్రైనింగ్ కాలేజీ, డీలక్స్ సెంటర్, హెడ్ పోస్టాఫీసు, మహాకాళేశ్వర ఆలయం మీదుగా రథయాత్ర ఇస్కాన్‌కి చేరడంతో ముగుస్తుందని శివానంద నిమాయదాస్ వివరించారు. రథయాత్రలో భక్త జనులు పాల్గొని జగన్నాథ స్వామి అనుగ్రహం పొందాలని ఆయన కోరారు. కమిటీ సభ్యులు రవీంద్ర చైతన్య దాస్ మాట్లాడుతూ రథయాత్రను ఒక్కో ఏడాది ఒక్కొక్క ప్రాంతం మీదుగా నిర్వహిస్తున్నామని గతేడాది కంబాల చెరువు నుంచి ప్రారంభించగా ఈసారి శ్యామలానగర్ రామాలయం సెంటర్ నుంచి ప్రారంభిస్తున్నామని చెప్పారు. రథయాత్ర ముగిసాక జగన్నాథస్వామి లీలలపై ప్రవచనం, 56రకాల చొప్పున భోగ నైవేద్యం, దీప హారతులు, అనంతరం ప్రసాద వితరణ ఉంటాయని ఆయన వివరించారు. శ్యామాంగ శ్రీనివాస్ దాస్, హేమ నిమాయదాస్ సమావేశంలో పాల్గొన్నారు.

నిర్లక్ష్యపు తీగలు

ధవళేశ్వరం: ధవళేశ్వరం గోదావరి గట్టు రోడ్డుపై విద్యుత్ తీగలకు పాదులు, పొదలు చుట్టి ప్రమాదకరంగా మారాయి. మరో పక్క వర్షాకాలం రావడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందో అని వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. ధవళేశ్వరం సాయిబాబా గుడి నుంచి గాయత్రి ఇసుక ర్యాంపు వరకు ఉన్న విద్యుత్ స్తంభాలకు పాదలు పాకి అల్లుకుపోయాయి. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పొదలు, పాదులు పెరిగిపోయినా పట్టించుకునే వారే కరువయ్యారు. ఈదురు గాలులు సమయంలో వీటి ప్రభావం వల్ల విద్యుత్ తీగలు తెగి పడే ప్రమాదం పొంచి ఉంది. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగే అవకాశం ఉంది. విద్యుత్ శాఖ అధికారులు తక్షణమే స్పందించి విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ప్రమాదకరంగా పాకిన పాదులను, పొదలను తొలగించాలని పలువురు కోరుతున్నారు.



విద్యుత్ తీగలకు ప్రమాదకరంగా పాకిన పొదలు,పాదులు



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ప్రమాదకరంగా పాకిన పాదులు

పైపులైన్ లీకేజీతో ధ్వంసమవుతున్న రహదారి



పైపులైను లీకేజీ అవుతున్న దృశ్యం

రాజమహేంద్రవరం రూరల్: పిడింగొయ్యి గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్‌టీపీ ప్లాంట్ రోడ్డులో జుహేరా హోటల్ ఎదురుగా రోడ్డు కింద ఉన్న పైపులైను కొద్దిరోజులుగా లీకేజీ అవుతోంది. ఈ పైపులైను లీకేజీ వల్ల నూతనంగా రూ.లక్షలతో నిర్మించిన రోడ్డు ధ్వంసమవుతోంది. ఈ విషయంపై స్థానికులు అధికారులు దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ స్పందించలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైపులైపు లీకేజీలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యా సామగ్రి వితరణ

కంబాలచెరువు: స్థానిక దానవాయిపేట మున్సిపల్ స్కూల్లో పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు పలక, బలపం కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు విద్యాసామగ్రిని శుక్రవారం అందించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఉపాధ్యాయుడు రొబ్బి సన్యాసిరావు చేతులమీదుగా విద్యార్థులకు పలకలు, బలపాలు, ప్లాస్టిక్ బాక్సులు, ఆట వస్తువులు, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. పూర్వ విద్యార్థులు నిర్మల్ కుమార్, ఉంగరాల ప్రభాకర్, కేబుల్ మూర్తి, అనిశెట్టి బాబీ, ప్రవీణ్ కుమార్, గేదెల శ్రీను పాల్గొన్నారు.

45 మంది విద్యార్థులకు ఉపకార వేతనం అందజేత



విద్యార్థులకు చెక్‌లు పంపిణీ చేసిన క్లబ్ సభ్యులు

సీటీఆర్ఐ: పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించడం చాలా సంతోషంగా ఉందని వాకర్స్ యోగ, లాఫింగ్ క్లబ్ అధ్యక్షుడు శనపతి సత్తిబాబు అన్నారు. శుక్రవారం వాకర్స్ యోగ అండ్ లాఫింగ్ క్లబ్ (స్వచ్ఛంద సేవా సంస్థ) ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాలలోని ఆనందా గార్డెన్స్‌లో పాలసానపల్లి జగ్గారావు జ్ఞాపకార్థం పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు, వృద్ధులకు పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 45 మంది ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తూ వారు ఉన్నత విద్యావంతులుగా మారడానికి, మంచి ఉద్యోగ అవకాశాలు పొందడానికి సంస్థ తరపున కృషి చేస్తున్నామన్నారు. దాతలు జి.నిర్మల్‌కుమార్ రూ.36 వేలు, క్లబ్ కార్యదర్శి గుబ్బల గంగాభవానీ రూ.25 వేలు, చల్లా శంకరరావు రూ.10 వేలు, విక్రమ్ ఎస్.జెన్సీరూ.11 వేలు, తమనంపూడి రామిరెడ్డి రూ.10 వేలు, డాక్టర్ కంటే వీరన్న చౌదరి రూ.10 వేలు, శ్రీమాన్ చిన్న వెంకన్న బాబు స్వామిజీ రూ.3 వేలు, ఆదిలక్ష్మి తన భర్త జ్ఞాపకార్థం రూ.5 వేలు పేద విద్యార్థుల ఉపకార వేతనం పంపిణీకి విద్యానిధికి విరాళంగా అందజేశారన్నారు. ప్రతి నెలా మాదిరిగానే 80 మంది వృద్ధులకు ఒక్కొక్కరికీ రూ. 500 చొప్పున రూ. 40 వేలు, 45 మంది విద్యార్థులకు రూ.3.50 లక్షలను ఉపకార వేతనంగా అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకుడు పామర్తి గోపాలరావు, ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.ఏబెల్ రాజబాబు, క్రాంతి నర్సింగ్ హోమ్ అధినేత డాక్టర్ కంటే వీరన్న చౌదరి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: అత్యవసర విద్యుత్ మరమ్మతుల నిమిత్తం శనివారం నగరంలో పలు ప్రాంతాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శ్యామ్యూల్ శుక్రవారం ప్రకటించారు. దీని ప్రభావంతో పీఅండ్‌టీ, 5 నంబర్ బస్టాండు, కోరుకొండ రోడ్డు, రాజా థియేటర్, క్వారీ సెంటర్ ఏరియా, టీపీ రోడ్డు ఏరియా, కొంతమూరు ఏరియా భవానీపురం ఏరియా, రామదాస్ పేట ఏరియా, పనసచెట్టు సెంటర్, సంజీవ్‌నగర్, మార్కెట్ యార్డ్, జయ కృష్ణాపురం వీరభద్రపురం, ఇన్కమ్ టాక్స్ ఆఫీస్ ఏరియా, కోరుకొండ రోడ్డు ఏరియా, ఆదెమ్మ దిబ్బ ఏరియా హరిపురం ఏరియా, సుబ్బరాయపురం ఏరియా, లలిత నగర్ ఏరియా, విద్యానగర్ కాలనీ, సుభాష్ నగర్ మొత్తం ఏరియాల్లో ప్రభావం ఉంటుందన్నారు. లాలా చెరువు ఏరియా, సుబ్బారావు పేట, నారాయణపురం, సైకిల్ కాలనీ, గోపాల్ నగర్ పుంత, గాంధీపురం 4, రెవెన్యూ కాలనీ, పోస్టల్ కాలనీ, సాయిదుర్గ నగర్, మల్లీనా నగర్, రామాలయం సెంటర్, జేఎన్ రోడ్డు, తరుణి కాంప్లెక్స్, అభయ హాస్పిటల్, రత్న అపార్ట్‌మెంట్స్, లాలాచెరువు ఏరియా, సుబ్బారావు పేట, బాబానగర్, సైకిల్ కాలనీ, వాంబే కాలనీ, స్వరూప నగర్, రూపానగర్, నాగమ్మ తల్లి గుడి రోడ్డు, పోలీస్ క్వార్టర్స్, బ్యాక్ సైడ్, ప్రకాష్ నగర్, రాజేంద్రనగర్, సుబ్బారావు పేట, దానవాయిపేట, నెహ్రూ నగర్, ఉమెన్స్ కాలేజీ ఏరియా, భాస్కర్ నగర్, సీటీఆర్ఐ, గాంధీపురం హౌసింగ్ బోర్డ్ స్పిన్నింగ్ మిల్ కాలనీ ప్రాంతాల్లో ప్రభావం ఉంటుందన్నారు.

9న మోటార్ సైకిళ్ల వేలం

రాజమహేంద్రవరం రూరల్: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో రాజమహేంద్రవరం సౌత్ స్టేషన్ పరిధిలో నాటుసారాయి, ఇతర నేరాలలో పట్టుబడిన ఆరు మోటార్ సైకిళ్లను ఈనెల 9న ఉదయం 8 గంటలకు వేలం నిర్వహిస్తున్నట్లు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ పి.హనుశ్రీ తెలిపారు. జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారి ఆదేశాల మేరకు ఎస్ఈబీ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం తిలక్ రోడ్డులోని సౌత్‌స్టేషన్ ఆవరణలో వేలం నిర్వహిస్తామన్నారు. వేలంలో పాల్గొనేవారు ఆధార్‌కార్డు నకలుతో పాటు దరఖాస్తు రుసుము రూ.5వేలు జమ చేయాలన్నారు. వేలంలో వాహనాలు దక్కించుకున్న వ్యక్తులు మొత్తం సొమ్ముతో పాటు, 18 శాతం జీఎస్టీ సొమ్మును చెల్లించాల్సి ఉందన్నారు. వాహన వివరాల కోసం 96035 17003, 73861 63994 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సెబ్‌ఇన్‌స్పెక్టర్ పి.హనుశ్రీ తెలిపారు.

కొత్త చట్టాలపై అవగాహన సదస్సు



సెంట్రల్ జైలులో కొత్త చట్టాలపై అవగాహన కల్పిస్తున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రకాశ్‌బాబు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్ బాబు జైలు అధికారులు, సిబ్బందికి కొత్త చట్టాలు, భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సంహిత, భారతీయ సాక్ష్య అధినీయంపై అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. జైలు సూపరింటెండెంట్ రాహుల్ ఆధ్వర్యంలో నూతన చట్టాలపై అధికారులు, సిబ్బందికి, పారాలీగల్ వలంటీర్లకు అవగాహన కలిగించారు. చట్టాలను కేంద్ర ప్రభుత్వం ప్రస్తుత దేశ పరిస్థితులకు అనుగుణంగా మార్పులు చేసిందని, మారిన చట్టాలు ఈనెల 1వ తేదీ నుంచి అమలులోకి వచ్చాయన్నారు. ఈ చట్టాలలో మార్పులు, నియమావళి, అమలు, ప్రయోజనాలు, సంస్కరణలను వివరించారు. ఆడి యో, వీడియో రికార్డింగ్, సీసీ కెమెరా రికార్డింగ్ మొదలైన వాటికి చట్టబద్ధత కల్పించారన్నారు. కార్యక్రమంలో మహిళా జైలు సూపరింటెండెంట్ వసంతకుమారి, డిప్యూటీ సూపరింటెండెంట్ యం.రాజకుమార్, బి.రత్నరాజు, జైలర్స్ కేవీ.రామారావు, ఆర్.శ్రీనివాసులు, కె.దుర్గా రమేష్, సీహెచ్.సురేష్ కుమార్, మహేష్, ప్రేమ్ కుమార్, డిప్యూటీ జైలర్స్, సిబ్బంది, న్యాయ సేవాధికార సంస్థ న్యాయవాదులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో హాజరు శాతం పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ-2 సత్యనారాయణ

పెదపూడి: నేను బడికిపోతా.. కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో హాజరు నమోదు శాతం పెంచడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ-2 సీవీవీ సత్యనారాయణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండలంలోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ పాఠశాలల్లో నిర్వహించే ప్రార్థన కార్యక్రమానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు ముందుగానే హాజరు కావాలన్నారు. విద్యార్థుల్లో పఠనా, లేఖనా నైపుణ్యాలను పెంపొందించాలన్నారు. విద్యా ప్రవేశ్ కార్యక్రమాన్ని అన్ని పాఠశాలల వారు విధిగా అమలు చేయాలన్నారు. సెన్సస్ రిజిస్టర్ నిర్వహించాలని సూచించారు. ప్రతి పాఠశాల వారు మధ్యాహ్న భోజన పథకం మెనును అనుసరించి నాణ్యమైన, పౌష్టిక విలువలతో కూడిన ఆహారాన్ని పిల్లలకు అందించాలన్నారు. మధ్యాహ్న భోజనం నిర్వహించే ప్రదేశం, పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ఆదేశించారు.

గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు




సమావేశంలో మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో కార్యచరణ ప్రణాళికతో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడమే ప్రధాన లక్ష్యమని ఆ దిశగా సత్వర చర్యలు చేపడుతున్నట్లు రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి పేర్కొన్నారు. శుక్రవారం హుకుంపేటలోని మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో నియోజకవర్గంలో చేపట్టవలసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై మండల స్థాయి అధికారులతో ఎంపీడీవో డి.శ్రీనివాసరావు అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి సంబంధించి కాలువల్లో పూడికతీత, అంతర్గత రహదారులు, డ్రైయిన్ల మరమ్మతులు, శానిటేషన్, తాగునీటి సరఫరాకు ప్రాధాన్యత నివ్వాలని అధికారులకు సూచించారు. మండల ప్రత్యేకాధికారి, జిల్లా గిరిజన సంక్షేమ సాధికారిత అధికారిణి కేఎస్.జ్యోతి, డీఎల్‌డీవో పి.వీణాదేవి, ఎంపీడీవో డి.శ్రీనివాసరావు మండలస్థాయి అధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు మార్ని వాసుదేవరావు, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అభాగ్యుల ఆకలి తీరుస్తూ.. సేవలో స్ఫూర్తి

- నిరాటంకంగా నాలుగేళ్లుగా అన్నదానం
- ఆదర్శంగా నిలుస్తున్న స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్



వృద్ధులు, దివ్యాంగులకు ఆహారాన్ని అందిస్తున్న ముత్యాల పోసికుమార్ దంపతులు

ధవళేశ్వరం: మానవ సేవే మాధవ సేవగా భావించి అభాగ్యులైన వృద్ధులు, దివ్యాంగులకు నిరాటంకంగా నాలుగేళ్లుగా అన్నదానం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్, సత్య దంపతులు. వృద్ధులు, దివ్యాంగులను తమ సొంత కుటుంబ సభ్యుల్లా అక్కున చేర్చుకొని ప్రతి రోజూ ఆహారాన్ని అందిస్తూ వారికి వ్యక్తిగతంగా అండగా నిలుస్తున్నారు. పలువురు దాతలు ముందుకు వచ్చి వృద్ధులు, దివ్యాంగులకు దుస్తులు, దుప్పట్లు అందజేస్తూ మానవత్వాన్ని చాటుతున్నారు. ధవళేశ్వరం కంచర్లలైన్‌లో స్ఫూర్తి చారిటబుల్ ట్రస్టును ప్రారంభించి నాలుగేళ్లుగా సేవలందిస్తున్నారు. కోవిడ్ సమయంలో ప్రారంభమైన ఈ సేవా కార్యక్రమాన్ని తర్వాత కూడా పూర్తిస్థాయిలో కొనసాగించారు. అనేక మంది తమ జన్మదినం, వివాహ దినోత్సవాల సందర్భంగా వృద్ధులు, వికలాంగులకు అందించే నిత్యాన్నదానంలో భాగస్వాములవుతున్నారు.

కుటుంబ సభ్యురాలిగా చూసుకుంటారు



ప్రతి రోజూ ఆహారాన్ని అందిస్తున్నారు. సొంత కుటుంబ సభ్యురాలిగా చూసుకుంటున్నారు. ట్రస్టు సేవలకు రుణపడి ఉంటాను. నాలుగేళ్లుగా ఆహారాన్ని అందిస్తున్నారు.

– నెల్లిమి నాగమ్మ, ధవళేశ్వరం

ఆకలి తీరుస్తున్నారు



నిత్యాన్నదానం ద్వారా నాలాంటి ఎందరికో ప్రతి రోజూ ఆకలి తీరుస్తున్నారు. కొన్నేళ్లుగా సేవలు కొనసాగుతున్నాయి. ఎండ, వాన తేడా లేకుండా ప్రతి రోజూ అన్నార్తులకు ఆహారాన్ని అందించడం అభినందనీయం.

–పీరుబాబు, ధవళేశ్వరం

దివ్యాంగులు, వృద్ధులకు అండగా నిలిచేందుకే



అభాగ్యులైన వృద్ధులు, దివ్యాంగులకు అండగా నిలిచేందుకు ట్రస్టును ఏర్పాటు చేశాం. కోవిడ్ సమయంలో వారి బాధను చూసి నిత్యాన్నదానాన్ని ప్రారంభించాం. అందరి సహకారంతో నాలుగేళ్లుగా అన్నదానం ద్వారా సేవలందించగలిగాను.

– ముత్యాల పోసికుమార్,ట్రస్ట్ అధ్యక్షుడు

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బీ ప్లస్ ప్లస్ గ్రేడ్

సీతానగరం: స్థానిక సీతానగరం ప్రభుత్వ కళాశాలకు నాక్ టీమ్ బీ ప్లస్ ప్లస్ గ్రేడ్ సర్టిఫికెట్ అందించారని ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల 27, 28లో నాక్ టీమ్ కళాశాలలోని సమస్త సౌకర్యాలు పరిశీలించిన అనంతరం బీ ప్లస్ ప్లస్ గ్రేడ్‌ను కేటాయించారన్నారు. బీ ప్లస్ ప్లస్ అత్యధిక స్కోరు 3.00 సీజీపీఏ కళాశాల సాధించిందన్నారు. గతంలో కళాశాలకు బీ గ్రేడ్ ఉందని, ప్రస్తుతం బీ ప్లస్ ప్లస్ గ్రేడ్ సాధించిందని, ఇది ఐదేళ్లు అమలులో ఉంటుందన్నారు. దీని వల్ల కళాశాలకు రూసా నుంచి నిధులు వస్తాయని తద్వారా అభివృద్ధికి అవకాశం ఉంటుందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ హరే రామకృష్ణ, అధ్యాపకులు ఎస్కే మదీనా, డాక్టర్ నాగేశ్వరరావు, సుబ్బారావు, డాక్టర్ మాదవ్, వాణి, అలేఖ్య, మీనాక్షి పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల: ఆ ఒక్కటీ అడక్కు
అనుశ్రీసినిమాస్: ఓఎంజీ(ఓ మంచి ఘోస్ట్)
సూర్యప్యాలెస్: దేస్పికేబుల్‌మి 4
సూర్యమినీ: కల్కి2898ఏడీ
స్వామి: మహారాజ
అశోక: కల్కి2898ఏడీ
రాజా: కల్కి2898ఏడీ
శివజ్యోతి:మనమే
రంభ:14
ఊర్వశి: భారతీయుడు
మేనక: బాక్
అప్సర: కల్కి2898ఏడీ
కుమారి: హరోంహర,కల్కి2898ఏడీ(3షోలు)
నామవరం:
వీఎస్.మహల్:కల్కి2898ఏడీ
ధవళేశ్వరం:
మురళీకృష్ణ:కల్కి2898ఏడీ
కడియం:
వెంకటసూర్య:కల్కి2898ఏడీ